సాగునీటి కోసం ఎదురుచూపులు


పాలకోడేరు మండలం మోగల్లులో బీటలు తీసిన వరి చేలు


మోగల్లులో నీటి ప్రవాహం లేని దక్షిణ కాలువ


నారుమడికి నీరు తోడేందుకు ఇంజన్ ఏర్పాటు చేసిన దృశ్యం

- కరుణించని వరుణుడు
- కాలువల్లోనూ నీరు లేని వైనం
- బీటలు వారుతున్న చేలు.. ఎండిపోతున్న నాట్లు
- ఆందోళనలో రైతన్నలు

పాలకోడేరు: వర్షాకాలం వచ్చినా వరుణుడు కరుణ చూపకపోవడంతో రైతులు అల్లాడిపోతున్నారు. అప్పుడే జూలై మాసంలో రెండు వారాలు దాటుతున్నా వర్షాలు సక్రమంగా పడకపోవడం.. ఎండలు మండిపోతుండడంతో చేలకు అవసరమైన సాగునీరు అందడం లేదు. దీంతో సకాలంలో నాట్లు పూర్తవుతాయో లేదనని ఉండి నియోజకవర్గంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత మూడు రోజులుగా మబ్బులు వేస్తున్నా వర్షాలు కురవకపోవడంతో రైతులు దిక్కుతోచనిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

ప్రారంభ దశలోనే నాట్లు

ఉండి నియోజకవర్గంలోని ఉండి మండలంలో 18,880 ఎకరాలు, కాళ్ల మండలంలో 3,900, పాలకోడేరు మండలంలో 10,400, ఆకివీడు మండలంలో 4100 ఎకరాలు కలిసి మొత్తం 29,280 ఎకరాల్లో వరి సాగు అవుతుంది. ప్రతి ఏడాది వరి సాగు చేసేందుకు జూలై మాసంలో పూర్తి శాతం ఆకుమడులు వేసేవారు. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. కనీసం 50 శాతం కూడా నారుమడులు వేసుకోలేని పరిస్థితి నెలకొందని రైతుల ఆందోళన చెందుతున్నారు. పాలకోడేరు మండలం మోగల్లు, కోరుకొల్లు, గుత్తుల వారి పాలెం, గరగపర్రు తదితర గ్రామాల్లో సాగునీరు అందక నారుమడులు బీటలు వారుతున్నాయి. ఉండి మండలంలో ఉప్పులూరు, యండగండి, పెద్ద పుల్లేరు, కలిసిపూడి శివారు ప్రాంతాల్లో, అలాగే ఆకివీడు కాళ్ళ మండలాల్లోని శివారు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి సైతం నెలకొంది.

పట్టించుకోని అధికారులు

వరి సాగుకి రైతులు నారుమడులు వేసేందుకు సన్నద్ధం అవుతున్నా సాగునీరు అందించడంలో అధికారులు విఫలం చెందుతున్నారు. సాగునీటిపై అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. మరీ ముఖ్యంగా శివారు ప్రాంతాలకు కాలువల్లో నీరు పారడం లేదు. అధికారులు మాత్రం కాలువల్లో నీరు పుష్కలంగా ఉందని, నీరు ఎందుకు రావడం లేదని ఎదురు ప్రశ్నలు వేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

బీటలు వారుతున్న నారుమడులు

పాలకోడేరు మండలం మోగల్లు, కోరుకొల్లు తదితర గ్రామాల వరి పొలాలకు రేలంగి ఛానల్, బ్రాంచి కెనాల్ దక్షిణ కాలువల ద్వారా సాగునీరు అందాలి. అయితే దక్షిణ కాలువలో నీటి ప్రవాహం లేక వరి పొలాలకు నీరు చేరడం లేదు. దాంతో ఈ కాలువ ఆనుకొని ఉన్న వరి పొలాల్లో నారుమడులు బీటలు వారాయి. సాగునీరు అందక నారుమడులు వేసుకోలేని పరిస్థితి నెలకొందని మరికొందరు రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల నారుమడులు ఎండిపోతుంటే ఇంజన్ల ద్వారా నీరు తోడుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. ప్రాథమిక దశ నుంచే పెట్టుబడి ఎక్కువ అయిపోతుందని ఇలా అయితే వరి సాగు చేసేది ఎలా అని రైతులు దిగాలు చెందుతున్నారు.

కాలువల్లో నీటి ప్రవాహం లేదు



కాలువల్లో నీటి ప్రవాహం లేక చెత్తాచెదారంతో నిండిపోయింది. అలాంటప్పుడు వరి పొలాలకు నీరు ఎలా వస్తుంది. నీటి ప్రవాహం పెంచితేనే గాని నీరందే పరిస్థితి లేదు. అధికారులు వెంటనే సాగు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలి.

– గుమ్మళ్ళ రంగ, రైతు, మోగల్లు

మోటార్ ఇంజన్ ద్వారా నీరు తోడుకుంటున్నాం



నారుమడులు వేశాం.. నీరందడం లేదు. దీంతో మోటార్ ఇంజన్ల ద్వారా నీరు తోడుకుంటున్నాం. సాగు మొదల నుంచి నీటికే పెట్టుబడి పెట్టాలంటే ఖర్చు తడిసి మోపెడవుతుంది. ఇలాగైతే వరి సాగు చేసేదెలా.

– చింతపల్లి శ్రీను రైతు, మోగల్లు

చర్యలు తీసుకుంటాం

కాలువల్లో నీరు పుష్కలంగానే ఉంది. కొన్ని ప్రాంతాలకు నీరందడం లేదని మా దృష్టికి వచ్చింది. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి ఇబ్బంది ఉన్న ప్రాంతాల్లో నిరందించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రతి ఎకరాకు నీరు అందిస్తాం. రైతులు అధైర్యపడవద్దు.

– శ్రీనివాస్ ఏఈ ఇరిగేషన్, అత్తిలి సెక్షన్

పీవీఎల్‌కు ఘన స్వాగతం


పీవీఎల్‌ని సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

కాళ్ల: ఉండి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజుకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అమెరికా పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన సందర్భంగా శనివారం పెదఅమీరంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులు పెద్ద ఎత్తున చేరుకుని పీవీఎల్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన నేతల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ ప్రతిష్ట పెంచేలా పనిచేయాలని హితవు పలికారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పెనుమత్స దుర్గాప్రసాద్ రాజు పుట్టినరోజు వేడుకలను కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వేగేశ్న జయరామ కృష్ణంరాజు, రాంబాబు, చేకూరి నరేంద్ర, నంద్యాల సీతారామయ్య, మంతెన సునీల్ వర్మ, పెనుమత్స ఆంజనేయరాజు, సాగిరాజు హరి వర్మ, కేశిరెడ్డి మురళి, గుండు నాగేశ్వరరావు, కొలమూరు రాజేష్, బిరుదుగడ్డ రమేష్ బాబు, కోనా జోసెఫ్, గుండా సుందర రామూర్తి నాయుడు, పెనుమత్స రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మంతెన సీతారాం

భీమవరం: సూపర్ సిక్స్ పథకాలు అమలు వేగవంతం చేయాలని డిమాండ్ సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం విస్తృత సమావేశం ఆ పార్టీ పట్టణ కార్యదర్శి బి వాసుదేవరావు అధ్యక్షతన మెంటేవారి తోట పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న సీతారాం మాట్లాడుతూ ప్రత్యేక హోదా అడగటానికి కూటమి ప్రభుత్వానికి నోరు రావడంలేదని ఆయన ఆవేనద వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలు మోపడాన్ని తీవ్రంగా ఖండించారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ మాట్లాడుతూ ఎటువంటి ఆంక్షలు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వృద్ధులకు వితంతులకు వికలాంగులకు ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క పెన్షన్ మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టిడ్కో ఇల్లు పాడబడిన బంగాల్లా తయారయ్యాయని, వెంటనే మౌలిక వసతులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఎం వైకుంఠరావు, డి త్రిమూర్తులు, బి.సత్యనారాయణ, సీహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కల్యాణ మండపానికి నిధులు కేటాయించాలి


రాజ్యసభ ఎంపీ పాక సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు

భీమవరం: మండలంలో ఆర్యవైశ్య కల్యాణ మండపానికి ఎంపీ నిధులు కేటాయించాలని కోరుతూ శనివారం రాజ్యసభ సభ్యుడు పాక సత్యనారాయణకు మండల ఆర్యవైశ్య సంఘ సభ్యులు వినతి పత్రాన్ని అందించారు. సంఘం అధ్యక్షుడు పర్రిపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు, సంఘ సభ్యుల సహాయ సహకారాలతో దిరుసుమర్రులో 27 సెంట్లు స్థలాన్ని సేకరించి రిజిస్ట్రేషన్ చేయించామని, ఇక్కడ కళ్యాణ మండపం నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. దీనిపై రాజ్యసభ సభ్యుడు పాక సత్యనారాయణ మాట్లాడుతూ నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సోము, రంగ వరప్రసాద్, కోశాధికారి సోము వెంకటేష్, బచ్చు కాశీ, జూలూరి నాగేశ్వరరావు, వబిలిశెట్టి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నిరసన


ఎస్ఎఫ్ఐ నిరసనతో గీతాంజలీ స్కూల్ నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

ఉండి: నిబంధనలకు విరుద్ధంగా సెలవు దినాల్లో కూడా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం తరగతులు నిర్వహిస్తుంటే విద్యాశాఖ అధికారులు మొద్దు నిద్ర నటిస్తున్నారని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కే గోవింద్ ఆరోపించారు. రెండో శనివారం సెలవు దినంనాడు స్థానిక గీతాంజలీ స్కూల్‌లో తరగతులు నిర్వహించడంపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్రైవేటు పాఠశాలల నిర్వాకాలు, అధిక ఫీజుల దోపిడీపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకుంటే ఎస్ఎఫ్ఐ ద్వారా నిరసనలు చేపట్టడం, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తామని హెచ్చరించారు. దీనిపై గీతాంజలీ స్కూల్ ప్రిన్సిపాల్, కరెస్పాండెంట్ ఎం వెంకటేష్‌ను వివరణ కోరగా ఈనెల 3వ తేదీన స్కూల్ స్ట్రైక్ కారణంగా శనివారం పదో తరగతి వారికి మాత్రమే క్లాసు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షుడు కే రోహిత్, ఉపాధ్యక్షుడు సాయి తదితరులు పాల్గొన్నారు.

శిష్టా భారతీలక్ష్మి ఉపాధ్యాయులకు ఆదర్శం


శిష్టా భారతీలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

భీమవరం: నిరంతర విద్య చైతన్య స్రవంతిగా విద్యార్థుల భవిష్యత్తే ఊపిరిగా హిందీ భాషతోపాటు తెలుగు శతకాలు చదివించి విద్యార్థుల్లో నైతిక విలువలు నేర్పిన ఉపాధ్యాయురాలు శిష్టా భారతీ లక్ష్మీ ఉపాధ్యాయ వ్యవస్థకే ఆదర్శమని ఎస్‌సీహెచ్ బీఆర్ఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి శ్రీనివాసరావు, రచయిత కలిగోట్ల గోపాలశర్మ అన్నారు. శనివారం భీమవరంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శిష్టా భారతీ లక్ష్మీ సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 30 ఏళ్లగా హిందీ, తెలుగు భాషల ప్రాచుర్యానికి విశేష కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ శిష్టా భారతీ లక్ష్మీ పేరిట ఈనెల 23న 35 మంది ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్‌లను అందజేస్తున్నట్లు చెప్పారు.

మేధావులు తమ విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలి



ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 1996- 2000 బ్యాచ్ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు

భీమవరం: మేధావులు, ఉన్నత స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు తమ విజ్ఞానాన్ని, అనుభవాలను విద్యార్థులకు అందించి వారి అభివృద్ధికి సహకరించాలని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ సూచించారు. కళాశాలలో 1996- 2000 బ్యాచ్‌లో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల రజితోత్సవ వేడుకలు శనివారం కళాశాల ప్రాంగణంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి సివిల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ జి శ్రీబాల అధ్యక్షత వహించారు. కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ విద్యా విధానంలో మార్పులు చోటు చేసుకుంటున్నందున ఎప్పటికప్పుడు విద్యార్థులకు అధునాతన పరిజ్ఞానం అందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలతో ఇంటర్న్‌షిప్ సౌకర్యం కల్పించటం, ప్రత్యేక సెమినార్లు ఏర్పాటు చేసే దిశగా ఆలోచించాలని కోరారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్‌కు చెందిన ప్రొఫెసర్ వీకే విశ్వనాథరాజు, ప్రొఫెసర్ జీవీ పద్మరాజు పూర్వ విద్యార్థుల సంఘం చేస్తున్న కృషిని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ యూ వెంకటపతిరాజు డాక్టర్ పీఏ రామకృష్ణంరాజు, ప్రొఫెసర్లు అర్జునరాజు, శివరామరాజు, రామరాజులను ఘనంగా సత్కరించారు. పలువురు పూర్వ విద్యార్థులు యూఎస్ నుంచి కూడా వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం.

పంట బోదెపై అక్రమంగా వంతెన నిర్మాణం


పంచాయతీ కార్యాలయం సమీపంలో పంటబోదెపై వంతెన నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

కాళ్ల: కాళ్ల మండలం ఎల్ఎన్ పురం గ్రామానికి తాగునీరు అందించే పంటబోదెపై ప్రైవేటు వ్యక్తులు అనుమతులు లేకుండా అక్రమంగా వంతెన నిర్మించడంపై గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈపంటబోదె పక్కనే తాగునీటి పైపులైన్ ఉందని, దానిపైన వంతెన నిర్మాణం కోసం వేసిన పిల్లర్ల వల్ల పైపులైన్ డ్యామేజ్ అయ్యే అవకాశం ఉందని ఆరోపించారు. ఇరిగేషన్, పంచాయతీ అనుమతులు తీసుకోకుండా ఇలా సెలవు దినాల్లో పనులు చేపట్టడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి కమలను వివరణ కోరగా వంతెన నిర్మాణానికి తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, అక్రమంగా వంతెన నిర్మిస్తే తొలగిస్తామన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

వీరవాసరం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆర్ కృష్ణయ్య జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవాని యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు జిల్లా పర్యటనలో భాగంగా శనివారం భీమవరం వచ్చిన ఆయన ఇటీవల రాజ్యసభ సభ్యులుగా నియమితులైన పాక సత్యనారాయణ నివాసానికి వెళ్లి అయనకు అభినందనలు తెలిపారు. అనంతరం వీరవాసరం మండలంలో కొన్ని గ్రామాల్లో గణేష్ భవానీ యాదవ్ పర్యటించి బీసీల సమస్యలను తెలుసుకున్నారు.

పౌష్టికాహారం పంపిణీ

భీమవరం: ప్రభుత్వ ఆసుపత్రిలోని హెచ్ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు శనివారం మానవత సంస్థ భీమవరం శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. సంస్థ సౌజన్యంతో 30 మందికి ఎనిమిది రకాల పప్పు దినుసులు, డ్రై ఫ్రూట్స్, పొన్నమండ గ్రామస్తుడు సూర్యనారాయణ రాజు సౌజన్యంతో భోజనం ప్యాకెట్లు, బి.అరుణ శ్రీ, లక్ష్మీ దంపతుల సౌజన్యంతో నగదు అందించినట్లు సంస్థ అధ్యక్షుడు చింతలపాటి రామకృష్ణంరాజు, కో చైర్మన్ కారుమూరి నరసింహమూర్తి (బాబు), ఎగ్జిక్యూటివ్ అల్లు శ్రీనివాసు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు హాజరయ్యారు.

ఏఎన్ఎంల ఇంటింటి ప్రచారం

ఆకివీడు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎన్ఎంలు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. స్థానికంగా 14వ వార్డులోని పలు వీధుల్లో శనివారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో జ్వరం సోకిన వ్యక్తులున్నట్లు గుర్తించి వారికి తగిన వైద్యం, సూచనలు ఇచ్చారు.

కుప్పనపూడిలో తాగునీరు కలుషితం


కుళాయిల ద్వారా వస్తున్న కలుషిత నీరు

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి గ్రామంలో మంచినీటి సరఫరా అధ్వానంగా ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా గ్రామంలోని రెండు రక్షిత మంచినీటి పథకాల ద్వారా కలుషితనీరు సరఫరా చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఫిల్టర్ చేయకుండా నేరుగా చెరువులోని నీటిని సంపుల్లోకి నింపి సరఫరా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. గ్రామంలో వెయ్యి కుళాయి కనెక్షన్లు ఉండగా వీటికి రెండు రక్షిత మంచినీటి పథకాల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. సుమారు నాలుగు ఫిల్టర్ బెడ్‌లుండగా కేవలం రెండు మాత్రమే అంతంత మాత్రంగా పనిచేస్తున్నాయి. దీంతో ఫిల్టర్ చేయకుండా రా వాటరే ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఇసుక, కంకర ఫిల్టర్‌బెడ్‌లలో నింపాల్సి ఉండగా నిధుల లేమితో కలుషితనీటినే సరఫరా చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై గ్రామ కార్యదర్శి కె. వెంకన్నను వివరణకోరగా గ్రామంలోని రెండు ఫిల్టర్ బెడ్‌లలో ఇసుక, కంకర పాడైపోయాయిని, వాటిని మార్చాల్సి ఉందన్నారు. సుమారు రూ. 8 లక్షలు నిధులు అవసరమవుతోందన్నారు. త్వరలోనే ఇసుక, కంకర కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

క్లుప్తంగా

విశేషాలంకరణలో శ్రీవారు



భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక జువ్వలపాలెం రోడ్డులో వేంచేసియున్న శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో ఆషాడ మాసం శనివారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తులసి దళాలతో స్వామివారిని విశేషంగా అలంకరించారు. భక్తులు శ్రీవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు సత్కారం


కొండేపూడిలో అగ్రికల్చర్ అసిస్టెంట్ మధును సన్మానిస్తున్న రైతులు

పాలకోడేరు: రైతులకు విశేష సేవలు అందించిన కొండేపూడి సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ మధును శనివారం రైతులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బొక్కా రాంబాబు, మాజీ ఎంపీటీసీ చింతపల్లి పద్మనాభం (వెంకటేశ్వరరావు) మాట్లాడుతూ ఐదేళ్లుగా కౌలు రైతు కార్డులు, ఈక్రాప్ నమోదు, రైతులకు మెలకువలు చెప్పడంలో మధు విశేష సేవలందించారన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ చింతపల్లి రామకృష్ణ, వార్డు మెంబర్ చింతపల్లి అప్పారావు, పస్తుల నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

బీఎస్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా డేవిడ్ మార్క్


డేవిడ్ మార్క్

ఉండి: బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కమిటీ సభ్యుడిగా చెరుకువాడ గ్రామానికి చెందిన డాక్టర్ ఈలి డేవిడ్‌మార్క్ నియమితులయ్యారు. గుంటూరులో జరిగిన రాష్ట్ర సమావేశంలో తనను నియమించినట్లు ఆయన తెలిపారు. మాజీ అధ్యక్షుడు బ్రదర్ మేడిద జాన్సన్, నూతన అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్‌సిన్హా ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యుడిగా తనకు స్థానం కల్పిడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆధ్యాత్మిక సేవ, క్రైస్తవ సమాజ అభివృద్ధికి కృషి చేస్తానని డేవిడ్‌మార్క్ తెలిపారు. కార్యక్రమంలో ఆకివీడు బ్రాంచ్ కార్యదర్శి యాడంగి జార్జ్‌ముల్లర్, కోశాధికారి మాకా జ్ఞానప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పశు పోషణలో జాగ్రత్తలు పాటించాలి

ఆకివీడు: అధిక పాల దిగుబడికి రైతులు పశుపోషణలో జాగ్రత్తలు పాటించాలని మండల పశు సంవర్థక శాఖ అధికారిణి కెల్లా భార్గవీ సత్య అన్నారు. మండలంలోని అయిభీమవరం, గుమ్ములూరు గ్రామాల్లో శనివారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక పాల దిగుబడికి నాణ్యమైన పశుగ్రాసాన్ని పశువులకు అందించాలన్నారు. ఆరోగ్యకరమైన పెయ్యి దూడలు సకాలంలో ఎదకు వస్తాయని చెప్పారు. ఉపాధి హామీ పథకం, పశుసంవర్థక శాఖ సంయుక్తంగా పశుగ్రాస ఉత్పత్తులను నూరు శాతం సబ్సిడీకి రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. 10 సెంట్ల నుంచి 50 సెంట్ల భూమిలో పథకం ద్వారా పశుగ్రాసాన్ని పెంచవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏహెచ్ఏఎస్ అమృత, అమూల్య, మహేష్, వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలి


వెంకట రాయుడికి అభినందనలు తెలుపుతున్న దృశ్యం

వీరవాసరం: వైఎస్సార్ సీపీ భీమవరం ఇన్‌చార్జి చినమిల్లి వెంకట రాయుడును పార్టీ పంచాయతీ రాజ్ విభాగం వీరవాసరం మండల నూతన అధ్యక్షుడు పులగం సుబ్రహ్మణ్యం శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధికి నిత్యం కృషి చేయాలని వెంకట రాయుడు సుబ్రహ్మణ్యంకు సూచించారు. తనకు పదవి అప్పగించిన పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజుకు, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషన్‌రాజుకు ఇతర నేతలకు సుబ్రహ్మణ్యం కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కర్ర ప్రకాశరావు, జి.చంద్రరావు, జి.గణేష్,. జి.శివ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

భీమవరం: స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని 12 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి రూ.6,08,958 చెక్కులను ఎమ్మెల్యే అంజిబాబు అందజేశారు. సీఎం సహాయ నిధి ద్వారా ఏడాది కాలంలో నియోజకవర్గంలో 222 మందికి రూ 2,06,07,905 అందించినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

కూటమి ప్రభుత్వంలోనే కీచక పర్వాలు


కొరపాటి అనిత

ఉండి: కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన నాటినుంచే రాష్ట్రంలో కీచక పర్వాలు ఎక్కువైపోయాయని రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొరపాటి అనిత తీవ్రంగా మండిపడ్డారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అక్కచెల్లెమ్మల జోలికి ఎవరైనా వస్తే వారిపై వెంటనే దిశాచట్టం కింద కేసులు నమోదు చేసేవారని గుర్తు చేశారు. అక్కచెల్లెమ్మల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తేవడమే కాకుండా వారి కోసం మహిళా పోలీస్‌స్టేషన్‌లను సైతం ఏర్పాటు చేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో ఉన్నత చదువుల కోసం వెళ్లిన యువతులపై జరిగిన లైంగిక వేధింపుల పట్ల హోంమంత్రి ఏం చర్యలు తీసుకుంటున్నారో తెలపాలని డిమాండ్ చేశారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై తీసుకుంటున్న చర్యలు గురించి ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం ఇండస్ట్రియల్ ఏరియాలో విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో నూతన విద్యుత్ తీగల మార్పిడి నిమిత్తం ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. నరసయ్య అగ్రహారం, సీఎంఆర్ ఏరియా, బస్టాండ్ ఏరియా, శ్రీనివాస్ సెంటర్, కళాభవన్ వీధి, రైతు బజార్, రైల్వే జంక్షన్ రోడ్, కందిగట్లవారి వీధి, మెంటే వారి వీధి ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

ఉండి: వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం మండలంలోని పాములపర్రుకు చెందిన పిల్లి నాగరాజు ఈ నెల 11వ తేదీ రాత్రి నడుచుకుంటూ గ్రామంలోని తన మామగారి ఇంటికి వెళుతుండగా అదే ప్రాంతానికి చెందిన పిల్లి కేశవరావు అతనిని అడ్డగించి నాపైనే కేసు పెడతావా అంటూ దాడి చేసి చంపుతానని బెదిరించాడు. దీనిపై బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళా జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి దుర్మార్గం

ఉండి: గుడివాడలో పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న కృష్ణాజిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన గుండాల దాడి దుర్మార్గపు చర్య అని వైఎస్సార్‌సీపీ ఆర్‌టీఐ రాష్ట్ర కార్యదర్శి బడుగు బాలాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దాడి ద్వారా రాష్ట్రంలోని మహిళలకు రక్షణ లేదని మరోసారి టీడీపీ, జనసేన రౌడీలు నిరూపించారని మండిపడ్డారు. ప్రజల నుంచి కూటమి ప్రభుత్వానికి వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఈ విధంగా మహిళా ప్రజాప్రతినిధులపై దాడికి పాల్పడ్డారని, ఈ ఘటనకు కారణమైన బాధ్యులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.